**సి.పి.బ్రౌన్ అకాడమీ నవ్యవీక్లి ఉగాది కథలపోటీలో విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ**

చలికాలం...
దానికితోడు - ఆకాశం ఉరుములతో మెరుపులతో యుద్ధవాతావరణాన్ని తలపింపచేస్తోంది.
మరి కాస్సేపట్లో కుంభవృష్టి తప్పదేమో అనిపిస్తోంది.
జన సంచారం ఎక్కడా కనిపించటం లేదు.
అందరూ ముసుగుతన్ని నిద్రపోతున్న సమయమది.
మధ్యమధ్య కోట గుమ్మం నుండి సమయాన్ని సూచిస్తూ ఘంటారవాలు వినబడుతూనే ఉన్నాయి.
రాత్రి రెండో జాము నడుస్తోంది.
అప్పటివరకు గ్రంథ రచన చేస్తున్న రాయలవారు ఏదో ప్రణయఘట్టం మధ్యలో ఆగిపోయారు.

# పూలు నవ్విన కాలం

## రసరాజు

గంటం ముందుకెళ్లటం లేదు.

ప్రబంధ కవుల ప్రణయ సన్నివేశాల్ని ఓసారి గుర్తుకు తెచ్చుకొన్నారు.

స్వీయానుభూతుల్నీ మననం చేసుకొన్నారు.

అయినా లేఖిని మొరాయిస్తూనే ఉంది.

ఆరోజు అంతగా కార్యభారం లేకపోవటంతో, ఎలాగైనా ఆ ప్రణయ ఘట్టాన్ని పూర్తిచేయాలనుకొన్న రాయలవారి రచన ఎందుకో అనుకొన్నంతగా పాకాన పడటం లేదు.

గంటాన్నీ, తాళపత్రాన్నీ యథాస్థానంలో ఉంచేసి ప్రక్కనే ఉన్న శయ్యా మందిరంలోకి అడుగు పెట్టారు.

అంతఃపురంలోని ఆ శయ్యా మందిరంలో కూడా చలిగానే ఉంది.

రాయలవారు కావాలనే అక్కడ అప్పుడప్పుడు ఎటువంటి ఉపశమన సదుపాయాల్నీ కల్పించరు.

దానిక్కారణం - శృంగారానికి చలి దోహదం చేస్తుందే తప్ప ఎటువంటి అవరోధాల్ని కలిగించదనేది రాజావారి అనుభవం.

రాయలవారు సాహితీ సమరాంగణ సార్వభౌములే కాదు - రసిక చక్రవర్తులు కూడ.

అప్పటికే అందాలరాణి చిన్నాదేవి ఆ శయ్యా మందిరంలో రాయలవారి మగసిరి కోసం ఎదురు చూస్తోంది.

"దేవిగారి కంటిమీదికి కునుకే రావటం లేదేమో..." రాయలవారు చిన్నాదేవి వేపు సరసనేత్రులై చూశారు.

"మదన ప్రభువులు దయచూపనిదే..." అంటూ ఆమె ఇంకా మాట్లాడుతుండగానే రాయలవారి దక్షిణ హస్తం రాణిగారి చుబుకాన్ని సుతారంగా స్పృశించింది.

ఆ తాకిడితో చిన్నాదేవి శరీరం ఒక్కసారిగా జలతరంగిణిలా జివ్వుమంది. కోటివీణలు ఒకేసారి కదన కుతూహల రాగాన్ని వినిపిస్తున్నట్లుగా ఉంది ఆ స్పర్శ. ఆమెకు ఇదేమీ క్రొత్త కాకపోయినా, ఆ స్పర్శ మాత్రం ఎప్పుడూ నూతనంగానే ఉంటుంది.

"చలిచలిగా ఉందికదూ..." మాటలోనే మదన తాపం రెచ్చగొడుతూ అన్నారు రాయలవారు.

"రవిచంద్ర నేత్రుల మీరుండగా..." చిన్నాదేవి పతి దేవుని కళ్లల్లోకి సిగ్గుతో చూస్తూ అన్న అసంపూర్ణవాక్యమిది.

"ఎంత కవితాత్మకంగా మాట్లాడావు దేవీ... మా కౌగిలి.... చలికాలంలో వేడిగానూ, వేసవిలో శీతలంగానూ ఉంటుందని కదూ నీ కవి భావం. పైగా ఆ రెండూ విష్ణుచక్షువులు. ఈ ప్రభువును అలా విష్ణువుతో పోల్చటంలో కూడా ఎంతో ఔచిత్యాన్ని పోషించావు...." అంటూ రాయలవారు ఆమెకు మరింత చేరువయ్యారు.

చిన్నాదేవి ఓరగా చూసింది.

ఆ చూపులు తియ్యని తూపులై రాయలవారికి గుచ్చుకొన్నాయి.

"దేవిగారు మరచినట్లున్నారే..." బుగ్గమీద చిటికేస్తూ కళ్లల్లోకి చూశారు.

"మన్నించండి..." అంటూ మరచిపోయిన తాంబూలం తాలూకు చిలకల్ని క్రమక్రమంగా చిన్నాదేవి రాజావారి నోటికందించింది.

రాయలవారు చిన్నాదేవి నోటికి కూడ రెండు చిలకల్ని అందించారు.

"ప్రణయఘట్టం ఎంతవరకు వచ్చిందో సెలవిస్తారా..." రాయలవారు వ్రాస్తున్న గ్రంథం గురించి సమయోచితంగా అడిగింది వలరాణి.

"ఇదిగో! ఇప్పుడేగా ప్రారంభిస్తున్నాం.... క్రమక్రమంగా తెలుస్తుంది" అంటూ రాయలవారు నర్మగర్భంగా మాట్లాడుతూ చిన్నాదేవి నడుంపై చేయివేశారు.

ఆ సమయంలో పొడవాటి జడలోని మత్తెక్కించే మల్లెపూలలోంచి ఏవో గుసగుసలు గుప్పుమన్నాయి.

రాయలవారిలో రతిరాజు అప్పటికే ఆపాదమస్తకం అణువణువునా ఆవహించి ఉన్నాడు. కోరిక కంగారు పెడుతోంది.

సరిగ్గా అదే సమయానికి ఉలిక్కిపడేలా శయ్యామందిరంలో చిన్న గంట మ్రోగింది.

అటు ప్రభువు, ఇటు రాణి ఏకకాలంలో విస్మయానికి గురయ్యారు. ఇంతవరకు అలా గంట మ్రోగిన సందర్భాలు ఎదురుపడలేదు.

ఇద్దరిలోనూ ఏదో శంక పొడచూపింది.

రాయలవారు వెంటనే అప్రమత్తులయ్యారు.

గోడకు అమర్చిన వేరే దృశ్య సాధనం నుండి బయటకు చూశారు.

వర్షం...

వాతావరణం భయానకంగా ఉంది...

ఆ వర్షంలో అంతఃపురానికి సంబంధించిన సూరప రాజు తడుస్తూ కనిపించాడు.

సూరపరాజు రాజావారికి నమ్మినబంటు. ఆచితూచి

వ్యవహరించటంలో అతనిదే పైచేయి. రాయలవారికే కాదు. అప్పాజీకి కూడ సూరపరాజంటే ఎంతో ఆదర భావముంది.

సూరపరాజు రాకలోని ఆంతర్యం ఏమిటో రాయలవారికి బోధపడలేదు.

రాజావారు తలుపు తీసి గంభీరంగా బయటికొచ్చారు.

''ప్రభువులు మన్నించాలి''.

''మనవి చేసుకోవచ్చు''.

''రామరాజు భూషణ కవిగారు ఏలినవారి దర్శనం కోసం వచ్చారు. ఈ సమయంలో ఎంతమాత్రం వీలుకాదని పదేపదే వారికి విన్నవించాం. అయినా తప్పదన్నారు. ఏ వేళలో దర్శించటానికైనా మహారాజా వారు అనుగ్రహించిన అత్యంత గౌరవ ప్రవేశపత్రాన్ని వారు చూపించారు. అప్పాజీగారు అస్వస్థులుగా ఉండటంతో నేరుగా తమ సముఖానికే వచ్చినట్లుగా కవిగారు వివరించారు...'' బంటు భయపడుతూ అసలు విషయాన్ని మనవి చేశాడు.

''వెంటనే ప్రవేశపెట్టు....'' రాయలవారు ఆదేశించారు.

సూరపరాజు వెనక్కి తిరిగివెళ్తూ ''కవిగారికి కాలం చెల్లినట్టే...'' అనుకొన్నాడు.

కవి గారు ప్రవేశించేలోగా రాయలవారు లోపలికెళ్లి దుస్తులు మార్చుకొని వచ్చారు.

సూరపరాజు రామరాజభూషణ కవికి వర్షంలో గొడుగు పడుతూ రావటం కనిపించింది.

రాయలవారు నిశితంగా చూశారు.

కవి గారిని రాజసన్నిధికి చేర్చి సూరపరాజు వెంటనే వెనక్కి వెళ్లి పోయాడు.

''ఏలినవారు మీరు! క్షమియింపగ వేడెద...'' అంటూ భయమూ, సంశయమూ కలసిన రీతిలో కవి గారు రెండు చేతులూ జోడించారు.

తొలి దర్శనంలో పద్యంతో పలుకరించే సంప్రదాయం అక్కడ కవులకు ఉంది. కాని, ఆరోజు కవిగారు పాదార్ఘంలోనే ఆగిపోయారు.

''దయ చేయండి భట్టుమూర్తిగారూ!... బాగా తడిసిపోయారే..'' అంటూ భుజంపై ఉన్న ఉత్తరీయాన్ని తుడుచుకోవటానికి ఇస్తూ అక్కడే ఉన్న ఉచితాసనాన్ని చూపించి, వేరే ఆసనంపై రాయలవారు ఉపవిష్టులయ్యారు.

''అంత ఇబ్బంది లేదు ప్రభూ! కృతజ్ఞుణ్ణి...'' అంటూ భట్టుమూర్తి గారు ఆ ఉత్తరీయాన్ని సవినయంగా తిరస్కరించారు.

రామరాజు భూషణకవికి ''భట్టుమూర్తి'' అనే మరో పేరు కూడా ఉంది.

''ఏమిటో చెప్పండి...'' అన్నట్లుగా రాయలవారు కవిగారి వైపు పరీక్షగా చూశారు.

ఏ మాత్రం ఆలస్యం చేయకుండా విషయాన్ని రెండు మాటల్లో ఉద్వేగ భరితంగా నివేదించారు కవిగారు.

ఆ ఉద్విగ్నత రాయలవారిని సైతం బలంగా తాకింది.

''ఇకమీరు బయల్దేరండి... ఎవరినైనా మీకు సాయంగా ఇంటివరకు పంపించమని మామాటగా సూరపరాజుతో చెప్పండి'' అంటూ రాయలవారు వెంటనే పైకి లేచారు.

ఇటువంటి కీలక సమయాలలో కూడా రాజావారు కవుల పట్ల అంత ఆదరాన్ని ప్రదర్శించటం కవిగారిని ఆశ్చర్య చకితుల్ని చేసింది.

రాయల వారి నేత్రాలలో రోషాగ్నులు ప్రజ్వరిల్లుతున్నాయి.

చిన్నాదేవికి పరిస్థితి బోధ పడలేదు.

అంతవరకు మరుమల్లెలా ఉన్న రాయలవారు ఎందుకలా ఒక్కసారిగా మందారంలా మారిపోయారో ఆమెకు అర్థం కాలేదు.

ఆ గదిలో తన ఉనికిని కూడ గమనించని పరిస్థితిలో మహారాజు వారున్నారు.

''ఏదో రాచకార్యంలే! ఆరా తీయకూడదు...'' అనుకొంటూ ఆమె ఆ జోలికి పోలేదు.

ఆ సమయంలో ''మౌనమే శరణ్యం'' అని ఆమె భావించింది.

***

శిశిరం తోక ముడిచింది.

వసంతం కోయిలై కూస్తోంది.

చెట్లు చిగురాకుల్ని కప్పుకొంటూ ముగ్ధమోహనంగా నవ్వుతున్నాయి.

కుప్పలు తెప్పలుగా విరిసిన పూలతో తోటలన్నీ కీర్తి పరిమళాల్ని దశ దిశలా వెదజల్లుతున్నాయి.

ప్రకృతి మొత్తం మీద చైతన్యంతో కళకళలాడుతోంది.

ఆ రసానంద వేళలో విజయోత్సవ సభ ప్రారంభం కావటానికి మరికొంత సమయం మాత్రమే ఉంది.

మంత్రులూ, సామంతులూ అటు యిటూ కొలువు తీరి ఉన్నారు.

ఆ ప్రక్కనే సైన్యాధిపతులు...

అష్ట దిగ్గజకవులు సరేసరి. పుంభావ సరస్వతీమూర్తులై అక్షర తేజస్సుతో ఉట్టిపడుతున్నారు.

గాయకులూ, నటులూ, నర్తకీమణులూ, చిత్రకారులూ ఇలా లలిత కళలకు సంబంధించిన వారందరూ ఆ కొలువు కూటానికే తోరణాల్లా ఉన్నారు.

నిర్ణీత స్థలంలో ప్రజలు కూర్చుని ఉన్నారు.

అందరూ లేచి ఉన్న వేళల్లో అప్పాజీ వెంటరాగా – రాణులతో వేంచేసిన రాయలవారు మంగళ తూర్యనాదాల మధ్య సింహాసనాన్ని అధివసించారు.

కుల దైవానికి ముందుగా పట్టమహిషి తిరుమలదేవి దీపారాధన చేశారు.

రాణీ చిన్నాదేవి పూమాల అలంకరించింది.

ఆస్థాన గాయకులు శుభగీతి గానం చేశారు.

వేదస్వస్తి జరిగింది.

మహామంత్రి తిమ్మరుసు (అప్పాజీ) విజయోత్సవ సభా సందర్భంగా నాందీ వాచకాలు పలికారు.

యుద్ధంలో విశేష వీరత్వం ప్రదర్శించి, విజయానికి కారకులైన సైనికులకు, అధికారులకు ఆ సమయంలో సత్కారం జరుగబోతోంది.

అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

సైనికులలో ముందుగా ఎవర్ని ఆహ్వానిస్తారో – ఎవరు అగ్రతాంబూలం అందుకొంటారో అంతా రహస్యంగా ఉంది.

రాయలవారు గొంతువిప్పారు. నిజానికి వారు మాట్లాడవలసిన పని లేదు. వారు మాటాడే మాటల్ని అప్పాజీయే చెప్పగలరు. కాని, రాజావారిలో ఉన్న ఔచిత్యం, సంస్కారం, ఆదరం, ప్రసంగాభిలాష అటువంటివి.

రాయలవారు ముందుగా ఒక శార్దూల పద్యాన్ని చదివి అప్పాజీవైపు చూశారు.

అప్పాజీ ''ఆజ్ఞాబద్ధులం'' అన్నట్లు కళ్లతోనే విన్నవించారు.

''మొదటి పేరు చదవండి మహామంత్రీ!....'' రాయలవారు ఆదేశించారు. సభలో ఒకటే ఉత్కంఠ....

అప్పాజీ లేచి సభలో ఆ పేరు ప్రకటించారు.

ఆ పేరు విన్నాక సభంతా ఒక్కసారిగా ఆశ్చర్యంతో గడ్డకట్టుకు పోయింది.

ఎవరూ ఊహించని పేరది...

పైగా సైన్యానికి సంబంధించిన పేరు కూడ కాదది.

''ఈ ప్రథమ సత్కారం వారికే ఎందుకు ప్రదానం చేయవలసి వచ్చిందో ప్రభువులు వారే వివరించగలరు...'' అంటూ అప్పాజీ యథాస్థానంలోకి వెళ్లి కూర్చున్నారు.

చెవులు రిక్కించి వినటానికి సభ కుతూహలంగా ఉంది.

''ఓ రోజు రాత్రి.... రెండవ జాములో... ఉరుములూ పిడుగులూ మధ్య కుంభవృష్టిలో తడుస్తూ జ్వరంతో ఉన్న రామరాజుభూషణ కవి గారు మా శయ్యామందరినాకి వచ్చారు... ఆ వేళలో సాహసించి ఎవరూ అలా రావటానికి సిద్ధపడరు. సమయమూ, ప్రదేశమూ, వాతావరణమూ అన్నీ అభ్యంతరకరమైనవే. ఒక్క అప్పాజీగారికి మాత్రమే అలా ఎప్పుడైనా రావటానికి అవకాశముంది. అదే గౌరవాన్ని ఈ ప్రభుత్వం అష్టదిగ్గజ కవులకు కూడా కల్పించింది. ప్రభువులు వారిని నేరుగా దర్శించుకోవటానికి వీలుగా ప్రవేశపత్రాల్ని ఈ రాజ్యం వారికి పదేళ్ల క్రితమే విజయదశమి ఉత్సవాల్లో ప్రదానం చేసింది.... అది కవుల పట్ల మాకున్న గౌరవం అని వేరే చెప్పనక్కరలేదు... ఇంతవరకూ ఈ ప్రవేశపత్రంతో అవసరం ఏ ఒక్కరికీ రాలేదు. మహామంత్రులు వారు కూడా సరాసరి శయ్యామందిరానికి వచ్చే సందర్భం ఇంతవరకు కలుగలేదు.... అసలీ ప్రవేశపత్రాలే ముళ్లకిరీటాలవంటివి... వినియోగంలో ఏ మాత్రం అనౌచిత్యం దొర్లినా, ఎంతటివారలైనా శిక్షార్హులు కావలసిందే..''

''నిజమే మరి....'' సభ తనలో తాను అనుకొంది.



"రామరాజభూషణ కవి గారు వచ్చారు. ఒక విషయం చెప్పారు. వారూ ఉద్విగ్నంగానే ఆ విషయం చెప్పారు. మేమూ అలాగే స్పందించాం. ఆ సమయంలో అప్పాజీగారు అస్వస్థలుగా ఉండి, అప్పుడే కోలు కొంటున్నారు. హిరణ్యగర్భ అయిన మన భూమిపై తీవ్రస్థాయిలో దండెత్తటానికి నిజాంషాహి రానున్న రెండు మూడు రోజుల్లోనే సిద్ధపడుతున్నారన్న రహస్య సమాచారాన్ని కవిగారు అందించారు. (నిజాం షాహి ఆస్థానంలో లేఖకునిగా పనిచేస్తున్న కవిగారి బంధువు ఈ రహస్యాన్ని చేరవేసిన సంగతిని ఔచిత్య మెరిగిన రాయలవారు సభాముఖంగా బహిర్గతం చేయలేదు) దానితో వెంటనే అప్రమత్తులయ్యాం..." అంటూ రాయ



లవారు ప్రక్కకు తిరిగి ఇష్టదైవం వైపు చూశారు.

సభ్యుల చూపులు భూషణకవిగారి మీదకు మళ్లాయి.

"ఆ సమాచారం మాకు సకాలంలో తెలిసిఉండక పోతే – విజయం అనివార్యమే అయినప్పటికీ ఎక్కువ శ్రమపడవలసి వచ్చేది. సంగతి ముందుగా తెలియటం వలన మరింత జాగరూకత ఏర్పడింది. సునాయాసంగా శత్రుమూకను తరిమికొట్ట గలిగాం. జ్వరతీవ్రతలో ఉన్నప్పటికీ భూషణకవి గారు తమ తక్షణ సమాచారం ద్వారా రాజభక్తిని చాటుకొన్నారు. ఆ తరువాత పదిహేనురోజులు అనారోగ్యంతో వారు మంచం దిగలేదు... అదీ వారి దేశభక్తి..." అంటూ రాయలవారు అప్పాజీ వైపు తిరిగారు.

అప్పాజీ పైకి లేచారు.

భూషణకవి గారిని ఆహ్వానించారు.

కవిగారికి ఈ సన్మానం ఏ మాత్రం ఇష్టంలేదు. అయితే రాజాజ్ఞను ధిక్కరించటం శ్రేయస్కరం కాదనుకొన్నారు.

రామరాజ భూషణకవి వేదికపైకి వచ్చారు.

ప్రత్యేకంగా నియమింపబడ్డ సన్మాన పీఠంపై కూర్చున్నారు.

రాయలవారు కవిగారి నుదుటిపై పొడవాటి కుంకుమ బొట్టును స్వయంగా తీర్చిదిద్దారు.

చేతులకు గంధం పూశారు...

దుశ్శాలువా కప్పి తలపై పూలు చల్లారు.

ప్రక్కనే పళ్లెంతో సిద్ధంగా ఉన్న పరిచారిక దగ్గర్నుంచి పద్య రూపంలో ఉన్న ఒక పత్రాన్ని తీసికొని అప్పాజీ చదివారు.

"ఐదువేల తులాల బంగారాన్ని ప్రభువుల వారు కవిగారికి కానుకగా సమర్పించారు. భూషణకవిగారు దీనిని స్వీకరిస్తూ విజయనగర సామ్రాజ్యాన్ని దీవింపగలరు..." అంటూ అప్పాజీ పత్రంలోని పద్య సారాంశాన్ని అందరికీ తెలిసేలా సభకు వివరించారు.

అప్పాజీ ఆ మాటలంటున్నప్పుడు మహారాజు వారి మీసాలను త్రోసుకొంటూ వచ్చిన చిరునవ్వు ఒక్కసారిగా తళుక్కుమంది.

"చిత్తం మహాప్రభో!... ఏలినవారి హిరణ్య సత్కారాన్ని శిరసావహిస్తున్నాను.." అంటూ రామరాజభూషణ కవి ఆ పత్రాన్ని చేతిలోకి తీసికొని కృతజ్ఞతగా ఒక పద్యం చదివారు.

"బళారె! భట్టుమూర్తి గారూ! మీ పదప్రయోగం నిరుపమానం. ఏదీ మరొకమారు అలరించండి..." రాయలవారు మరొకసారి ఆ పద్యాన్ని వినిపించమన్నారు.

మళ్లీ ఆ పద్యాన్ని చదివి "ఒక కోరిక ప్రభూ!.... చిత్తగించాలి..." అన్నారు కవిగారు.

"అవశ్యం... మీదే ఆలస్యం... ఏం కావాలన్నా నిర్వర్తించటానికి సిద్ధంగా ఉన్నాం...." రాయలవారు హామీ ఇచ్చారు.

ఇంతలో "మహారాజా వారికి ఒక మనవి" అంటూ సభ నుండి ఒక గొంతు వినిపించింది.

"మనవి చేసుకోవచ్చును... ఎవరది?.... ఓహో!.... వికటకవితా విభూషణులు తెనాలి వారా... ఇంతవరకు మీ సందడి లేకపోయింది..." అంటూ దరహాసం వెలిగించారు రాయలవారు.

సభ కూడా రామకృష్ణ కవిని చూసి నవ్వుల్ని పులుముకొంది.

## పరిచయం



పద్యం, పాట, కథ – ఇలా ప్రక్రియా భేదం లేకుండా అన్నింటిలోనూ అంతో ఇంతో సంబంధముంది. "రసభారతి" పద్య కవితా సంపుటం బెంగుళూరు గుల్బర్గా విశ్వవిద్యాలయంలో పాఠ్యగ్రంథం. "అసెంబ్లీ రౌడీ" సినిమాలో "అందమైన వెన్నెలలోన..." అనే పాటకు ఉత్తమ సినీ గీత రచయితగా మదరాసు కళాసాగర్ అవార్డు, సృజనాత్మక సాహిత్యానికీ, ఉత్తమ పద్య కావ్యంగా 'వేదిక'కు తెలుగు విశ్వ విద్యాలయం పురస్కారాలు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి ఉగాది విశిష్ట సాహితీ పురస్కారం పొందారు. ఏ రచనా అయినా సామాజిక ప్రయో 'జనానికి' దగ్గరగా ఉండాలన్నదే అభిమతం.

రాయలవారి పేరు తలచుకోగానే ముందుగా గుర్తుకొచ్చేది సాహిత్యమే. కవులకూ, వారికీ మధ్య ఎటువంటి ఆత్మీయానుబంధం ఎంత ప్రగాఢంగా ఉండేదో రసజ్ఞులకు తెలిసిందే. ఆ నేపథ్యమే ఈ "పూలు నవ్విన కాలం".

–రసరాజు

సెల్: 94403 88659

"ఏదైనా ఉన్నవారినే వరిస్తుందంటారు..." అంటూ రామకృష్ణకవి ఒక వాక్యం దగ్గరే ఆగిపోయారు.

"రామకృష్ణ కవీ! నేరుగా విషయంలోకి విచ్చేయండి..." అప్పాజీ తమ చేతిని అష్టదిగ్గజ పీఠం వైపు చూపించారు.

"భూషణకవిగారి చరిత్రే బంగారం కదా! ఇంకా వారికి బంగారం దేనికి?" రామకృష్ణ కవిగారి ప్రశ్నలో చాతుర్యం దోబూచులాడింది.

రాయల వారికి వికటకవి పలుకులోని ధ్వని అర్థమయింది. లోలోపలే నవ్వుకొన్నారు.

పెద్దనగారితో సహా మిగతా కవులకూ ఆ పలుకు చక్కిలిగింతలు పెట్టింది.

భూషణకవిగారు సైతం చిరునవ్వును ప్రకటించారు.

సభలో ఉన్న రసగ్రహణ పారీణులు కూడా కరతాళ ధ్వనులు చేశారు.

"భూషణకవి గారి ప్రబంధం పేరు వసుచరిత్ర.... వసువు అంటే బంగారమే కదా! అటువంటి బంగారు చరిత్ర కలిగిన భట్టుమూర్తి గారికి మరల ఈ బంగారమెందుకు?... అందుకే సంపద కలిగిన వారి చెంతకే సంపద చేరుతుందని మామాట... ఏమైనా ఇంతటి ఘనకార్యానికి రాజ హృదయం ద్రవించినందుకు మేము అభినందించి తీరవలసిందే.."

అంటూ వికటకవి గారు కూర్చున్నారు.

రామకృష్ణ కవిగారి మాటలలోని చమత్కారశోభతో సభ మొత్తం ఒక్కసారిగా పులకించింది.

"మీరెలా మాట్లాడినా చిన్నపిల్లల పలుకుల వలె అవి మాకు వీనుల విందులే... వసువుతో పాటు ఘనద్రవాలనూ చమత్కరించారు.. అందుకే మీరు వికటకవులయ్యారు...." అంటూ రాయలవారు మీసం దువ్వుతూ నగుమోముతో రామకృష్ణకవి గారి వైపు చూశారు.

"చిన్న పిల్లల పలుకులు" అనటంలో ఉన్న అందమైన చురకనూ, ధ్వనినీ గ్రహించిన వికటకవి పైకి లేవబోయి మళ్లీ వెంటనే కూర్చున్నారు.

"భూషణకవిగారూ!.... ఏదో కోరిక అన్నారు కదా! వివరించండి.." రాయలవారు గుర్తు చేశారు.

ఆ కోరిక ఏమిటో తెలుసుకోవటానికి అందరూ ఆసక్తితో ఎదురు చూస్తున్నారు.

భూషణకవిగారు గొంతు విప్పారు.

'ఏమీ లేదు ప్రభూ! కోరిక చిన్నదే... ఏలినవారే మాకు పెన్నిధులై ఉండగా మాకీ బంగారం దేనికి?... ఈ బంగారాన్ని మా అష్టదిగ్గజ కవుల పక్షాన ఒక నిధిగా ఏర్పాటుచేసి పేదవారి పెళ్లిళ్లలో మంగళసూత్రాల నిమిత్తం దీనిని వినియోగించే ఏర్పాటు చేయవలసినదిగా వేడుకొంటున్నాం... ఇవన్నీ ఇప్పటికే మహారాజా వారు చేస్తున్నారు... అయినా మా తృప్తి మేరకు దీనిని కూడా స్వీకరించి మరింత ఇతోధికంగా కార్యక్రమాన్ని చేపట్టగలరని శ్రీవారిని అభ్యర్థిస్తున్నాం.... ఈ రకంగా కవులు భాగస్వామ్యాన్ని కూడా ఆదరించినవారవుతారు.. రాయలవారూ కవిప్రభువులే కదా!" అంటూ భూషణకవి సవినయంగా చేతులు జోడించారు.

"అలాగే! కవుల భాగస్వామ్యాన్ని ఎప్పుడూ గౌరవిస్తాం... మమ్ములను కవిప్రభువులని ఇంతకుముందే మీరు వక్కాణించారు. మరి ఈ కవి రాయలను కూడా మీలో ఒకనిగా స్వీకరిస్తూ అదే భాగస్వామ్యం మాకూ కల్పించండి... తిరుమలేశుని దయతో ఈ మంగళసూత్రం మహాయజ్ఞాన్ని మీరన్నట్లు మరింత ఇబ్బడిముబ్బడిగా నిర్వహించటానికి రెండింతల బంగారాన్ని మా వంతుగా ఈ నిధిలో కలుపుతున్నాం. "అష్ట దిగ్గజ మాంగల్య కవితానిధి" పేరుతో ఇది శాశ్వతంగా కొనసాగుతుంది... ఆంధ్ర కవితా పితామహులు దీనిని అంగీకరిస్తున్నారు కదూ!... " అంటూ రాయలవారు అల్లసాని పెద్దన కవీంద్రులవైపు చూశారు.

ఆ మాటతో పెద్దనగారు పైకి లేచారు.

"ఎంతో సంతోషంగా ఉంది మహాప్రభూ! అయితే ఒక మనవి... ఏలిన వారు కూడా అష్టదిగ్గజ కవులతో కలిసిన కారణంగా సంఖ్య తొమ్మిదికి పెరిగింది. కనుక "మాంగల్య కవితా నవనిధి" అని నామకరణం చేద్దాం... మరొక విషయం మహారాజా! ఈ మాంగల్య ప్రణాళికను రాబోయే తరాలలో, ఏడుమార్లు తమరు దర్శించిన తిరుమలేశుని ఆలయం కూడా ప్రవేశపెట్టవచ్చునని మాకెందుకో అనిపిస్తున్నది. ప్రభువుల వారి పట్టాభిషేక పంచశతజయంతి మహోత్సవాలు కూడా భవిష్యత్తులో ప్రజలు విధిగా జరుపుకొంటారని మా అంతర్వాణి చెపుతున్నది... పూలునవ్విన ఈ కాలం చరిత్రలో ఎప్పుడూ సువర్ణాధ్యాయం గానే ఉంటుంది మహారాజా!..." అంటూ అల్లసాని వారు తమ పెద్దరికాన్ని నిలబెట్టుకొన్నారు.

"రవి కాననిచో కవి కాంచునే కదా.." అన్నారు మన భూషణకవిగారు ఒక పూరణపద్యంలో... తప్పక మీ భవిష్యద్వాణి జరిగి తీరుతుంది పెద్దనామాత్యా...." మహామంత్రి తిమ్మరుసు వారు అలా అనగానే సభ ఒక్కసారిగా హర్షధ్వానాలతో మారుమ్రోగిపోయింది.

*